బార్ అసోసియేషన్ హాల్ ప్రారంభం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ల కోసం ప్రత్యేకంగా నిర్మించిన బార్ అసోసియేషన్ హాల్‌ను సోమవారం జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, పుల్లా కార్తిక్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక హాల్‌ను వినియోగించుకోవాలని, అన్ని సదుపాయాలతో హాలు నిర్మాణం చేపట్టినందుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డితో పాటు సభ్యులను అభినందించారు. అదేవిధంగా బార్ అసోసియేషన్ ప్రధాన హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టర్‌ను సైతం ప్రారంభించారు. న్యాయవాదులకు ప్రొజెక్టర్ ఉపయుక్తంగా ఉంటుందని కొనియాడారు. నాంపల్లి కోర్టుల ఇన్‌చార్జి, జిల్లాజడ్జి సురేశ్, సీబీఐ జడ్జి రఘురామ్, మెజిస్ట్రేట్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, ఉపాధ్యక్షుడు గోకుల్, కోశాధికారి లడ్డా, సభ్యులు ఈశ్వర్, సీనియర్లు, న్యాయవాదులు రమణ గౌడ్, డి.అనంతరఘు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

కాచిగూడ, మార్చి 3: పార్లమెంట్లో ఆమోదం పొందిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం సబ్ కోటాను కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ మహిళలకు 50% కల్పించాలని కోరుతూ ఈనెల 18వ తేదీన జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో మహిళా భేరిని నిర్వహించనున్న తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ద్వారా మహిళల బేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహిళా భేరికి మద్దతి పలకాలని విజ్ఞప్తి చేశారు. రామన్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం మహిళలకు సంబంధించిన సబ్ కోటాను ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. స్వప్న, రామ శ్రీనివాస్, ఉదయనేత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రతి ఏడాది మహా శివరాత్రి అనంతరం వచ్చే సోమవారం రోజున కోఠి ఈ ఎన్ టీ ఆ సుపత్రి అవరణలోని శివాలయంలో స్థానిక వ్యాపారుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. సోమవారం నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమానికి సీనియర్ నాయకుడు వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించి, అన్నదానం ప్రారంభించారు. వేయి మందికి అన్నదానం చేశారు. నిర్వాహకులు ఇసాక్, హరి బాబూ, నిఖిలేశ్వర్, శ్రీరంగం, శరత్, ప్రతాప్, రతన్, కృష్ణ పాల్గొన్నారు.

– అబిడ్స్, మార్చి 3

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, మార్చి 3 : బాగ్‌అంబర్‌పేట డివిజన్, సాయిబాబా దేవాలయం నుంచి రామకృష్ణానగర్ వరకు నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని పలు బస్తీలలో నూతనంగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో కలిసి డీడీ కాలనీ, సోమసుందర్‌నగర్ లేన్ 10 నుంచి 12 వరకు పర్యటించారు. ఈ సందర్భంగా సోమసుందర్‌నగర్‌లో కాలనీ వాసు లు వారు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో గుంతలుగా మారిన రోడ్లకు ప్యాచ్ వర్క్ వేయాలని చెప్పారు. చెట్లకొమ్మలు ఏపుగా పెరగడం, విరిగి కిందపడడంతో పార్కింగ్ చేసిన కార్లు పాడవుతున్నాయని తెలిపారు. వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, కాలనీలో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వీధి దీపాల నిర్వహణ ఏఈ సౌమ్యను పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. హార్టికల్చర్ సూపర్‌వైజర్ శ్రీధర్‌ను పిలిచి కాలనీవాసులకు ఇబ్బందులు కలుగకుండా చెట్టు కొమ్మలు కొట్టి వేయాలని చెప్పారు. పారిశుధ్య సూపర్ వైజర్లకు చెప్పి మట్టికుప్పలు, చెత్తచెదారాన్ని లారీలలో ఎత్తించారు. వచ్చే శ్రీరామనవమి వరకు కాలనీలో రూ.22 లక్షలతో నూతన రోడ్డును నిర్మిస్తామన్నారు. కోతుల బెడదకు కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఈ ప్రశాంతి, వాటర్‌వర్క్స్ డీజీఎం విష్ణ వర్ధన్‌రావు, మేనేజర్ మాజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాల కృష్ణ, వీధి దీపాల ఏఈ సౌమ్య, బీఆర్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ సీహెచ్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, పి.గెల్వయ్య, టి.రమేశ్ కెంచె మహేశ్, బంగారు శ్రీను, జె.బాల్‌రాజు, శ్రీహరి, సురేశ్, మిర్యాల శ్రీను, వెంకటరమణరాజు, శివ పాల్గొన్నారు.

జైస్వాల్ గార్డెన్ రెసిడెంట్స్ అసోసియేషన్

అంబర్‌పేట, మార్చి 3 : గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీమైసమ్మ ఆలయం నూతన కమిటీలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల కమిటీ కన్వీనర్ బి.వినోద్‌కుమార్, కమిటీ సభ్యులు ఎ.రామాగౌడ్, హెచ్.బి. వల్లభ్, ఆడెపు లక్ష్మీపతి, ఎ.రాజమల్లు పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రతినిధుల పేర్లను కమిటీ ప్రకటించింది. జైస్వాల్ గార్డెన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.సత్యంగౌడ్, ఉపాధ్యక్షుడిగా పి.కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎన్. స్వామిగౌడ్, కోశాధికారిగా రాములు యాదవ్, జాయింట్ సెక్రటరీగా ఎ.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.ప్రవీణ్‌కుమార్, సభ్యులుగా కె. శ్రీనివాస్‌గౌడ్, వి.వి.రామచందర్‌రావు, డి .చెన్నయ్య ఎన్నికయ్యారు.

మైసమ్మ టెంపుల్ కమిటీ...

శ్రీ మైసమ్మ టెంపుల్ కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.యాదవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.దిలీప్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ఇంద్రసేనా యాదవ్, కోశాధికారిగా పి.వెంకటేశ్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.శ్రీహరి, కమిటీ సభ్యులుగా కె.అశోక్ కుమార్, కె.ఈశ్వరయ్య, పి.రామస్వామి, మహిళా సభ్యురాలిగా టి.కృష్ణవేణిలను ఎన్నుకున్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహదీపట్నం, మార్చి 3 : విద్యుత్ లైన్లలో మరమతుల కారణంగా ఆసిఫ్ నగర్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం కరెంటు సరఫరా నిలిపివేసినట్లు ఏడీఓ ప్రకటనలో తెలిపారు

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 :30 గంటల వరకు

బంజారి దర్వాజా, అటారసీడీ, గోల్కొండ పోలీస్ స్టేషన్ క్వార్టర్స్, బాలాహి సార్, రిసాల బజార్, రేషన్ బాగ్ కటోర హౌస్ గెలాక్సీ థియేటర్, ఆడంస్ కాలనీ, రాహుల్ కాలనీ మొహల్లాగాంజ్ గోల్కొండ ఏరియా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

బాగ్‌అంబర్‌పేటలో ఎమ్మెల్యే పాదయాత్ర

బాగ్‌అంబర్‌పేటలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, మార్చి 3: అంబర్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్ధని అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట కొన్ని రోడ్లకు నిధులు మంజూరు కాగా వాటి ప్రారంభోత్సవాలకు కాంగ్రెస్ వాళ్లు అడ్డుపుల్ల వేస్తున్నారని తెలిపారు. సోమవారం ఆయన బాగ్‌అంబర్‌పేట సోమసుందర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడారు. నిధులు మంజూరైన పనులు ప్రారంభిద్దామంటే కాంగ్రెస్ నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ రావాలని, వి.హనుమంతరావు రావాలని చెబుతున్నారని, వారికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మందుల బస్తీలో రోడ్డును తవ్వగా మా నాయకులు రాకుండా రోడ్డు ఎలా వేస్తారని కాంగ్రెస్ నాయకుడు శంభుల శ్రీకాంత్‌గౌడ్ అడ్డుకున్నాడని తెలిపారు. వారి మధ్య సమన్వయం లేకపోవడంతో పనులు పెండింగ్ అవుతున్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ నేత రోహిణ్‌రెడ్డికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయ లేదని పేర్కొన్నారు. అభివృద్ధికి సహకరించకుంటే వి.హనుమంతరావు ఇంటి ముందు ధర్నా చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వం దవాఖాన ముందు గల్లీలో ఇదే పరిస్థితి ఉందని వివరించారు.

ఆక్రమణలను అరికట్టాలని కలెక్టర్‌కు వినతి

హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బజరంగ్‌సేన తెలంగాణ అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు

అబిడ్స్, మార్చి 3: మహదేవ్ ఆలయ భూమి ఆక్రమణపై బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫీల్‌ఖానాలోని మహాదేవ్ ఆలయం స్థల విషయమై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ ఆస్తి అయిన ఆలయ భూమిలో బిల్డర్స్ చేపట్టిన అక్రమ నిర్మాణం గురించి లక్ష్మణ్ రావు కలెక్టర్‌కు తెలిపారు. అనధికార నిర్మాణంలో రెండు సెల్లార్ అంతస్తులు, ఆరు అదనపు అంతస్తులు మరియు ఒక పెంట్ హౌస్ ఉన్నాయని తెలిపారు. ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

నియో బీబీసీలో పేషంట్లకు ఉచిత అంబులెన్స్ సౌకర్యం

జ్యోతి వెలిగిస్తున్న రిటైర్డ్ హైకోర్టు జడ్జి వి.వి.ఎస్.రావు, ఎండీ రంగయ్య

అంబర్‌పేట, మార్చి 3 : విద్యానగర్‌లోని నియో బీబీసీ హాస్పిటల్ జంటనగరాల్లో ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించిందని, అలాగే జంట నగరాల్లో ని వందకు పైగా పీడీయాట్రిక్ హాస్పిటల్స్‌లో తమ దవాఖానకు మాత్రమే ఆరోగ్య శ్రీ సౌకర్యం ఉందని ఎండీ డాక్టర్ మంచుకొండ రంగయ్య తెలిపారు. నియో బీబీసీ హాస్పిటల్ 15వ వార్షికోత్సవం స్థానికి సురభి గ్రాండ్‌లో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ హైకోర్టు జడ్జి వి.వి.ఎస్.రావు హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా డాక్టర్ ఎ.వై.చారి, రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డా.వి.అబ్రహం పాల్గొన్నారు. డాక్టర్లు బి.సురేష్, సి.సురేశ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, శ్రీధర్, నరేందర్‌రావు, ప్రభాకర్ రావు, రామ్మోహన్ పాల్గొన్నారు.

దీపక్ శర్మకు ఐకానిక్ పీస్ అవార్డు

ఐకానిక్ పీస్ అవార్డును అందుకుంటున్న దీపక్‌శర్మ

సుల్తాన్‌బజార్, మార్చి 3: ప్రముఖ సంఘ సేవకులు హ్యూమన్ రైట్స్ ఆక్టీవిస్ట్ డాక్టర్ దీపక్ శర్మకు ఐకానిక్ పీస్ అవార్డు లభించింది. ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన న్యూఢిల్లీకి చెందిన ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో నగరానికి చెందిన డాక్టర్ దీపక్ శర్మకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో గత 15 ఏండు డాక్టర్ దీపక్ శర్మ తన సొంత నిధులతో సమాజంలో పేదవారికి ఇతర అణగారిన వర్గాలకు ఎంతో మేలు చేశారు. ఆయన సేవలను గుర్తించిన సంస్థ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దీపక్ శర్మ మాట్లాడుతూ.. 15 ఏండ్లుగా సమాజానికి సహాయ సహకారాలు అందిస్తున్నాని తెలిపారు. అలాగే పేదలకు న్యాయ పరమైన సహాయం చేయడంతో పాటు పౌరుల హక్కుల కోసం హ్యూమన్ రైట్స్ ఆక్టివిస్ట్‌గా పౌర సమాజానికి తన వంతు కృషి చేశానని తెలిపారు. తనకి అవార్డును అందించిన ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

అవార్డు గ్రహీతలతో సామాజికవేత్త డాక్టర్ వరప్రసాద్, నిర్వాహకులు డాక్టర్ శాంతికృష్ణ

రవీంద్రభారతి, మార్చి 3 : తెలుగు సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సామాజికవేత్త (యుఎస్ఏ) డాక్టర్ వరప్రసాద్ అన్నారు. శ్రీశాంతికృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో అంతర్జాతీయ సంస్కృతిక సంబర మ హోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వరప్రసాద్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.వరప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణలోని వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం పర్వతగిరి మండలంలో ఉన్నన బతుకమ్మ తల్లి జన్మస్థలమైన చౌటుపల్లి గ్రామంలో1985, మార్చి3న స్థాపించబడిన శ్రీశాంతి కృష్ణ సేవా సమితి నాలుగు దశాబ్దాలుగా కళారంగానికి అనేక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. భారతదేశంతోపాటు అమెరికా, కెనడా, బ్రిటన్, అస్ట్రేలియా లాంటి 45 దేశాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాంస్కృతిక మహోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది పద్మచారి, ఏసీపీ కిరణ్‌కుమార్, ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, కరోనా వైద్య నిపుణులు ఆనందయ్య, నృత్యగురువు డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు. సభకు ముందు కళాకారులు ప్రదర్శించిన పలు నృత్యప్రదర్శనలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకన్నాయి..

ఎనిమిది మందికి కారుణ్య నియామకాలు

ముజీబ్ హుస్సేనీని శాలువాతో సన్మానిస్తున్న స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం. భాస్కర్ తదితరులు

సుల్తాన్‌బజార్ మార్చి 3: టీఎన్జీవో కేంద్ర సంఘం కృషితోనే జిల్లా విద్యాశాఖలో 8 మందికి కారుణ్య నియామకాలు లభించాయని టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ అన్నారు. సోమవారం నాంపల్లిలోని గృహకల్ప ఆవరణలోని హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డా క్టర్ ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీని వారు నూతనంగా కారుణ్య నియామకాలు పొందిన 8 మంది ఉద్యోగులతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం ముజీబ్ హుస్సేనీ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డీఈవో రోహిణి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ జి.రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కాజా సోహెల్ అహ్మద్ ల ప్రోత్బలంతో 8 మందికి కారుణ్య నియమకాలలో ఉద్యోగాలు రావడం ఎంతో ఆనందగా ఉందని పేర్కొన్నారు. ఎన్.మాధురి, సయ్యద్ శుజావుద్దీన్, సయ్యద్ అజారుద్దీన్. మొహమ్మద్ షాజాబ్ ఖాన్, మహమ్మద్ అమిర్ ఖాన్, కేఎంఎం శ్రీనాంత్, దాసరి చిన్న తిమ్మయ్య, మహమ్మద్ గౌస్, ఇస్మాయిల్ బేగ్‌లను నియమించడం పట్ల వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఉపాధ్యక్షుడు రూగేశ్, సంయుక్త కార్యదర్శి జయంతిరెడ్డి పరచార కార్యదర్శి ఎంవై రవి కార్యవర్గ సభ్యులు ముజాయిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

అదృశ్య మైన సుభాకర్ రావు

చార్మినార్, మార్చ్ 3: నగరంలోని బంధువుల ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చంద్రయాణ గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుడు తెలిపిన ప్రకారం.. కోయంబత్తూరు కు చెందిన సుభాకర్‌రావు (44)ఫిబ్రవరి 22న చంద్రయణ గుట్ట రూమన్ హోటల్ వద్ద కు వచ్చాడు. అనంతరం సుభాకర్ రావు నుంచి ఎలాంటి సంప్రదింపులు లేకపోవడంతో కుటుంబ సభ్యులు కోయంబత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు స్థానిక చంద్రయణ గుట్ట పోలీసులతో కలిసి సుభాకర్ రావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన రుమాన్ హోటల్ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల వీడియో లను పరిశీలిస్తున్నామని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, మార్చి 3: పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ చారి తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి (50) సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫారం 1 చివర్లో పట్టాల పక్కన నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దావకానకు తరలించారు. మృతుని ఒంటిపై నీలి రంగు దానిపై ఎరుపు రంగు గీతల టీ షర్ట్, నలుపు రంగు పాయింట్ ధరించి 5.5 ఉన్నట్లు తెలిపారు. మృతుని సమాచారం కోసం 81 43807592లో సంప్రదించాలని హెడ్ కానిస్టేబుల్ కోరారు.

పుట్ పాత్ పై మరో వ్యక్తి ..

కాచిగూడ, మార్చి 3: అనారోగ్యంతో పుట్ పాత్ పై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. అడ్మిన్ ఎస్సై డీ.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా, కనిగిరి మండలానికి చెందిన స్టాలిన్ కుమారుడు జాన్ (50) కొంతకాలంగా అనారోగ్యంతో ఉంటూ సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్ పార్కింగ్ పుట్పాత్‌పై మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

ఇండ్లను కూల్చివేయడం విచారకరం

మాట్లాడుతున్న మేధాపాట్కర్

అబిడ్స్, మార్చి 3: మూసీ పరీవాహక ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్న వారి ఇండ్లను కూల్చివేయడం విచారకరమని ఇండియన్ సోషల్ యాక్టివిస్ట్ మేధా పాట్కర్ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసించిన వారి నివాసాలను కూల్చివేయడంతో వారి విజ్ఞప్తి మేరకు తాను శంకర్‌నగర్ ప్రాంతంలో పర్యటించేందుకు వెళ్లగా పోలీసులు తనను ప్రశ్నించారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడికైనా వెళ్లడానికి హక్కు ఉంటుందన్నారు. మూసీ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి నివాసముంటున్న వారిని మూసీ ప్రాజెక్టు పేరిట ఇండ్లను కూల్చివేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లోకి మార్చడం బాధాకరమన్నారు. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు నివాసం ఉంటే వారికి ఒకే డబుల్ బెడ్ రూమ్‌ను కేటాయిస్తే ఆ నలుగురు నివాసం ఉండేది ఎలా అని ప్రశ్నించారు. మూసీ ప్రాంత ప్రజల ను ఒప్పించి తదుపరి వారి నివాసాలను స్వాధీనం చేసుకొని తరలించాలి తప్ప బలవంతంగా తరలించడం తగదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాంతంలోని ప్రజలను కలిసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఎక్కడికైనా వెళ్లేందుకు హక్కు ఉందని ఆమె అన్నారు.

ప్రజవాణి కార్యక్రమంలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

చార్మినార్, మార్చి 3 : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజవాణి కార్యక్రమంలో అయన పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జడ్సీ వెంకన్న మాట్లాడుతూ.. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చాంద్రాయణ గుట్ట, సంతోష్‌నగర్, చార్మినార్ సర్కిల పరిధిలోని అక్రమ నిర్మాణాలపై –03, ఇంజినీరింగ్ సమస్యలపై –02.. మొత్తం –05 ఫిర్యాదులు అందినట్లు జడ్సీ తెలిపారు.

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరిస్తున్నమన్నారు. ఇప్పటి వరకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జోనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ సీటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్ , ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల విషయంలో సమయానుకూలంగా స్పందించాలి



రూ. 1,50,000 చెక్కును డీసీపీకి అందజేస్తున్న ఆసుపత్రి వర్గాలు

మెహిదీపట్నం మార్చి 3 : ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు వెంటనే స్పందించి క్షతగాత్రులకు సమయానుకూలంగా చికిత్స అందించాలని దక్షిణ పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ అన్నారు. సోమవారం సాయంత్రం నానల్ నగర్ ఒలివ్ ఆస్పత్రిలో ప్రమాదాలు జరిగినప్పుడు అందించాల్సిన ప్రథమ చికిత్సపై పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ చంద్రమోహన్ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఆసుపత్రి వర్గాలు 1,50,000 చెక్కును డీసీపీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు సయ్యద్ ఫయాజ్, మునావర్, విజయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్ తో ఎమ్మెల్యే సమావేశం

ప్రజలకు రంజాన్ మాసంలో పారిశుధ్య సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం ఖైరతాబాద్ జోనల్ కమ